# స్పర్శ

విశ్వనాథ పావనిశాస్త్రి



**నా** కొక్కడే మేనమామ. ఆయన కాస్తా పోయాడని వార్తొచ్చింది. స్పర్శ అంటారు చూశారూ దాని ప్రకారం నాకేడుపు రావాలి, లేదా కంటతడి రావాలి. ఊహుం! రాలేదు.

కనీసం సాటి మనిషి ఒకడు పోయినప్పుడు కలిగే బాధ కూడా కలగ లేదు. పోనీ, చచ్చాడు పీడ వదిలిపోయింది అనే భావం కలిగిందా? ఎందుకు కలుగుతుంది? నాకేమైనా శత్రువా ఆయన.

మరేమిటయ్యా అంటే - ఏమిటో? రోడ్డుమీద వెళుతున్నాము. ఎందరో ఎదు రౌతున్నారు; వాళ్ళందరూ ఎవరు? ఏమిటి. ఎక్కడికెళ్తున్నారు; ఎందుకెళ్తున్నారు. యివన్నీ ఆలోచిస్తామా? ఊరికే గమనిస్తూ వుంటాము.... అదుగో అల్లావుంది నా మనస్సు.

మా మామయ్య గత పాతికేళ్ళుగా అమెరికాలోనే వుంటున్నాడు. ఒక్కడే కొడుకుంటే వాడికి పెళ్ళిచేసి అక్కడే స్థిర పడిపోయాడు. ఈ దేశానికి వ్యాపార నిమిత్తం తరుచూ వస్తూ వుంటాడు. అల్లా వచ్చి ఈసారి హఠాత్తుగా గుండె ఆగి పోయి చచ్చిపోయాడు. కర్మలు సొంత వాళ్ళే చేస్తున్నారు.

ఈ పాతికేళ్ళలో ఆయన్ని ఒక పది సార్లు చూసుంటాను. మా యింట్లో పని మనిషుంది. దాని పేరు బీబీ. నేను ప్టక ముందునించీ మా యింట్లో పని చేస్తోంది. దాని మొగుడు గాజులమ్మేవాడు. అదెప్పు డైనా వాళ్ళ ఊరు వెళితే వాళ్ళన్నయ్య పనిచేసే తోటలోంచి రెండు జామకాయలు కోసి తెచ్చి "నీకోసమని తెచ్చాను. తిను బాబూ" అనేది. అల్లాంటిది. మా మామయ్య అమెరికానుంచిఏడాది రెండేళ్ళ కోసారి వచ్చేవాడా? చేతులు ఊపుకుంటూ రావడం, బొర్ర ఊపుకుంటూ వెళ్ళడం. ఒక్కసారి; మా అమ్మకుగాని, నాకుగాని మా చెల్లాయికిగాని ఒక్కటంటే ఒక్క నూలుపోగైనా తెచ్చేవాడుకాదు! ఆయనేదో తేవాలనీ కాదు, తవ్వి పొయ్యాలనీ కాదు. ఆ ఆప్యాయతకి చెపుతున్నాను. నిజానికి బీబీకేం పట్టిందని జామపండ్లు తెచ్చేది? తెస్తేనేనా ప్రేమ అని అనవచ్చు ఎవ రైనా?

కాని! మా నాన్న పోయినప్పుడు బీబీ, దాని మొగుడు ఎంత సేవ చేశారు? ఎంత పని చేశారు? బంధువులున్నారంటే విమర్శించడంకాదుగాని, కర్రపెత్తనానికి, వంకలుపెట్టడానికి తప్ప గట్టిగానిలబడి పని చేసేవాళ్ళెవరు? ఏం ముట్టుకుంటే ఏం అంటుకుంటుందో?

అప్పుడు మా మామయ్య కనీసం పదోరోజుకి చెరెల్నిచూసి, నెత్తిన ఒక్క బట్టవెయ్యడానికి రాలేకపోయాడు. రావల సిన ధర్మంలేదా ఆయనకి? అదే అక్నె ల్లకి ఆయన "బిజినెస్ పార్ట్‌నర్" పోతే జెట్ విమానంలా దూసుకొచ్చివడ్డాడే!

ఇవాళ ఆయన పోయినపదోరోజు. నేను ధర్మోదికాలకివస్తానని చెప్పి మాఅమ్మని ఆనాడే పంపించాను. కాని నిజానికి నాకు వెళ్ళాలనిపించడంలేదు. కానీ నా ధర్మం! వెళ్ళక తప్పదు. పాపం మా మేనమామ కొడుకు! శుభం అశుభం తెలియని వెధవ! ఏం యాతనలు పడుతున్నాడో ఏమిటో? యాతన ఏం వుందిలెండి డబ్బుపారేస్తే అన్నీ వస్తాయి! వాహకులూ దొరుకుతారు నిర్వాహకులూ దొరుకుతారు.

ఇక తప్పదురా అనుకుని ప్రొద్దున్నే లేచి బయలుదేరి వెళ్ళబోతుంటే, బీబీ చిన్న కొడుకువచ్చి. "బాబూ! మాఅమ్మ చచ్చిపోయింది" అని బావురుమన్నాడు. ఆఁ! ఆఁ! పరుగెత్తుకెళ్ళానువాళ్ళగుడిసెకి కాలవ ఒడ్డునవున్న గుడిసెకి. కాలవ ఎండిపోయి వుంది. నా కళ్ళు నిండి పోయాయి. బీబీ చచ్చిపోయింది! అవును బీబీ యికలేదు! మాయింట్లో ఎంత సేవ చేసింది? చచ్చేదాకా చేసింది. దాని కొడు

కులకైనా సరిగ్గా అన్నం పెట్టిందోలేదో కాని. మాకుమాత్రం తంచనుగా స్కూలు టైముకి క్యారేజీలు మోసుకొచ్చేది. ఒక్కొక్కసారి యిల్లు యిల్లంతా దానిమీద వదిలిపెట్టేసి మేం ఊరెళ్ళిపోయేవాళ్ళం. తిరిగి వచ్చేటప్పటికి యిల్లు సర్వ తో భద్రంగా ఉండేది. అటువంటి బీబీ చచ్చిపోయింది।

తడిగుడ్డ మెలిపెట్టి చిరిగిపోయేటట్టు పిండితే ఎలా వుంటుంది? ఒక్కసారిగా సహారా ఎడారి సముద్రమైతే ఎలా వుంటుంది? తెలియకపోతేవచ్చి నాగుండె చూడండి. అప్పటికీ తెలియలేదంటే మీకన్నా మా మామయ్యే నయం.

ఎవరో అప్పుడే వచ్చారు కాబోలు ఏడుస్తున్నారు. చూశాను. షేక్‌సాయిబు। బీబీ అన్నయ్య. చాలా పెద్దవాడు. ఎప్పుడైనా వచ్చి దూరంగా నిలబడి మాట్లాడేవాడు. కావలించుకుని ఏడ్చాను.

ఒరేయ్ సైదులూ! పట్టండ్రా! మీతో పాటు బీబీని గోరీల దొడ్డి దాకా నేను మోసుకొస్తాను " వగిలిన వెదురుబొంగు లోంచి వచ్చినట్లుంది నామాట. అందరూ



ఆశ్చర్యపోయి చూస్తున్నారు. ఈ బేవనాయన ఏంటి. యిట్టా మాట్టాడతాడేంటి అని షేక్‌సాయిబు అంత దుఃఖంలోనూ ముక్కు మీద వేలేసుకున్నాడు.

"ఏంది బాబూ! నీకేమైనా పిచ్చా" సైదులు! బీబీ పెద్దకొడుకు! నాకన్నా పెద్దవాడు! కోప్పడుతూ ధైర్యం చెపుతున్నాడు- "ఇంకా బీబీ ఎక్కడుందయ్యా! అదెప్పుడో ఎల్లిపోయింది. ఇప్పుడుంది కట్టెపుల్లేగదా! అది మేం పారేత్తాంలేగాని. నువు ఓహాయిదై పోమాక అల్లా తూకో" అన్నాడు.

నేను నిశ్శబ్దంగా ఏడుస్తూ నిలబడిపోయాను. "ఔనురా సైదులు ఔను! అది కట్టే! దాని కడుపున పుట్టావుకాబట్టి ఆ మాట అనగలిగావు. మా మేనమామ పదో రోజు. ఆయనకి సద్గతులు కలగడంకోసం నేనక్కడికి వెళ్ళి చెయ్యాల్సిన కొన్ని ధర్మాలున్నాయి. కాని....యిప్పుడు వెళ్తే నాకు సద్గతులు వుంటాయా! ఇక్కడవుండి అన్నీ చూసుకోవాల్సిన ధర్మం లేదూ!నాకు నేను వెళ్ళనుగాక వెళ్ళను. ఆయన పోతే కదలనుకూడా కదలని నా హృదయం బీబీ పోతే బద్దలైపోయింది కదరా! నేనిక్కడే వుంటాను.ఈ పుణ్యంలో కొంత ఆయనకి చేరకపోదులే. అది స్వర్గం! కానియిది! దానికి అమ్మ మొగుడు రా! అమ్మ మొగుడు.

